క్లుప్తంగా

రహదారి అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

కిర్లంపూడి: మండలంలోని సింహాద్రిపురం అడ్డు రోడ్డు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేస్తారని సోమవారం ఎంపీపీ తోట రవి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆసుపత్రికి బల్లల బహూకరణ


ఆసుపత్రికి చెక్కబల్లలు అందజేసిన దాతలు

ఏలేశ్వరం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు సోమవారం దాతలు చెక్కబల్లలు బహూకరించారు. పట్టణానికి చెందిన కోలా సూర్యనారాయణ జ్ఞాపకార్థం అతని భార్య కోలా పార్వతి, కుమారులు ప్రవీణ్, విఘ్నేశ్వరరావు రెండు చెక్కబల్లలు ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ బీసీ, ఓబీసీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీమన సూరిబాబు, కె.త్రిమూర్తులు, పీఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు


యర్రవరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆదిత్య

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం గ్రామంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాజెక్టు ఆరోగ్యలో భాగంగా స్పార్క్ సంస్థ చైర్మన్ సాయిసందీప్ ఆధ్వర్యంలో గ్రామంలోని రావిచెట్టు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు ప్రారంభించారు. ఏలేశ్వరం ఆదిత్య ఆసుపత్రి వైద్యులు సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. రోగులకు సుమారు రూ.15 వేలు విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, బొడ్డు కృష్ణ, సంస్థ సభ్యులు అంజి, స్వామి, సుదీప్, సాహూ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా 'స్వచ్ఛ భారత్'


తునిలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న విద్యార్థులు

తుని: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తున్నామని బీజేపీ తుని పట్టణశాఖ నాయకులు ప్రగడ చక్రరావు, పడాల విశ్వనాథ్ తెలిపారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా తుని తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల ఆవరణలో సోమవారం వ్యర్థాలు, కలుపు మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. స్థానిక సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు చేతులకు గ్లౌజులు ధరించి చెత్తను సేకరించారు. బీజేపీ నాయకులు కాదంబరి రామకృష్ణ, పి.అర్ధనారీశ్వరరావు, పుల్లంరాజు, ఆకెళ్ల శాస్త్రి, సత్యనారాయణ, వర్మ, వరప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో స్వచ్ఛతా హి సేవా

జగ్గంపేట: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట సచివాలయం-2 ఆవరణను స్థానిక భాష్యం స్కూల్ విద్యార్థులు శుభ్రం చేశారు. విద్యార్థులు చీపుర్లు చేతబూని వీధులను శుభ్రం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, జోనల్ ఇంచార్జి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

రౌతులపూడి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అన్నసమారాధనలు నిర్వహించారు. బలరామపురం, ఎ.మల్లవరం, రౌతులపూడి, గుమ్మరేగుల తదితర గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

సీటీఆర్‌ఐ: గోకవరంలో బుధవారం జరగాల్సిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కలెక్టర్ కె.మాధవీలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

విద్యుత్ భద్రతపై ప్రజలకు అవగాహన

జగ్గంపేట: గ్రామంలో సోమవారం విద్యుత్ భద్రత దినోత్సవం నిర్వహించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ భద్రత, ప్రమాదాల జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగంలో పాటించవలసి నియమాలను వివరించారు. జగ్గంపేట ఈఏ ఎ.శ్రీనివాస్ లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి భరోసా

- ప్రత్తిపాడు సీహెచ్‌సీలో సీమాంక్ విభాగం ఏర్పాటు
- బాలింతలు, నవజాత శిశువులకు ప్రత్యేక వైద్య సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


ప్రత్తిపాడు మాతా శిశు సంరక్షణ విభాగంలో ప్రసూతి వార్డు

ప్రత్తిపాడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే గర్భిణులు పురుడు పోసుకునేలా ప్రోత్సహిస్తోంది. ఆసుపత్రుల్లో ప్రత్యేక వసతులు కల్పిస్తోంది. దీనిలో భాగంగా ప్రత్తిపాడులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాతాశిశు సంరక్షణ విభాగం (సీమాంక్) ఏర్పాటు చేశారు. ఇక్కడ గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

2007లో శంకుస్థాపన

ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ నిధులు రూ.55.75 లక్షలతో సీమాంక్ సెంటర్ భవన నిర్మాణానికి 2007 అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. పదేళ్ల క్రితమే ఈ సీమాంక్ సెంటర్ భవన నిర్మాణం పూర్తి చేసినా ఏళ్ల పాటు వసతులు ఏర్పాటు చేయకపోవడం, పరికరాలు సమకూర్చకపోవడంతో భవనం నిరుపయోగంగానే ఉండేది. ఏళ్ల తరబడి అరకొర వసతులు, సిబ్బందితోనే తూతూమంత్రంగా నడిచేది. ఆధునిక పరికరాలున్నా వైద్య సేవలు ఉండేవి కావు. దీంతో ఈ భవనాన్ని ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రత్యేక వార్డుగా వినియోగించేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. ప్రస్తుతం సీమాంక్ కేంద్రంలో పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాటు చేయడమే కాకుండా ఆధునిక పరికరాలను కూడా ప్రభుత్వం సమకూర్చడంతో ఈ కేంద్రం సేవలను విస్తరించింది. ప్రస్తుతం ఈ సామాజిక ఆసుపత్రిలో ప్రతి మంగళవారం గర్భిణుల కోలాహలం, నవజాత శిశువుల కేరింతలే వినిపిస్తున్నాయి.

ప్రసూతి సేవలకు పూర్తిస్థాయిలో వసతులు

ప్రసూతి సేవలకు సీమాంక్ కేంద్రంలో పూర్తి సౌకర్యాలున్నాయి. చక్కని వార్డు ఉంది. పుట్టిన బిడ్డలు 2.5 కిలోల లోపు బరువు ఉంటే సంరక్షించేలా 'ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ - ఎస్ఎన్‌సీయూ) ఏర్పాటు చేశారు. ఇందుకోసం శిక్షణ పొందిన ఇద్దరు వైద్యులు, ఆరుగురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్‌ను నియమించారు. ఫొటోథెరపీ జరుగుతోంది. ప్రతి మండళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రసవాలు, శస్త్రచికిత్సల కోసం ఆధునిక పరికరాలతో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు.

ఎస్ఎన్‌సీయూలో లభించే సేవలు

ఈ ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ)లో బిడ్డ పుట్టిన రోజు నుంచి 90 రోజుల వయస్సు గల శిశువులకు 12 రకాల సేవలు అందుతున్నాయి. తల్లి పాలు తాగలేకపోవడం, బరువు తక్కువగా పుట్టిన శిశువులకు, శరీర ఉష్ణోగ్రత తక్కువ లేదా ఎక్కువ, వాంతులు ఎక్కువగా అవ్వటం, పొట్ట ఉబ్బరంగా ఉండటం, డొక్కలు ఎగురవేయటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తస్రావం (ముక్కు, చెవులు, బొడ్డు, జననేంద్రీయాల నుంచి), ఎక్కువగా ఏడవటం, శిశువులకు కామెర్లు, నీలిరంగు లక్షణాలు ఉండటం, రొటీన్ న్యూబోర్న్ కేర్ తదితర సమస్యలకు వైద్య సేవలు అందిస్తున్నారు. తల్లీ బిడ్డలను సురక్షితంగా ఉచితంగా ఇంటికి చేర్చేందుకు రెండు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి.

వెంటిలేటర్, ఐసీయూ ఏర్పాటు చేస్తే..

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచే కాకుండా కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన పేదలు, మధ్య తరగతి ప్రజలు ఈ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందుతున్నారు. ఈ సీమాంక్ సెంటర్‌ను కార్పొరేట్ ఆసుపత్రిని తలపించేలా తీర్చిదిద్దారు. నవజాత శిశువులు, గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. హైరిస్క్ కేసులను మాత్రం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈసీమాంక్ సెంటర్‌లో వెంటిలేటర్, ఐసీయూ వంటి వసతులు ఏర్పాటు చేస్తే హైరిస్క్ కేసులకు కూడా ఇక్కడే చికిత్స అందించవచ్చని సిబ్బంది చెబుతున్నారు.

110 మందికి ప్రసూతి సేవలు



తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు అన్ని వేళలా సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. వసతులు సమకూర్చిన తర్వాత సేవలు వినియోగించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. నెలకు సుమారు 110 మందికి ప్రసూతి సేవలు అందిస్తున్నాం. 50 మందికి పైగా ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. నవజాత శిశువుల కోసం పది బెడ్స్ ఉన్నాయి.

– ఎం కన్యాకుమారి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, ప్రత్తిపాడు

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత


కాకినాడ జీజీహెచ్‌లో చిన్నయ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సూర్యకుమారి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన రామకుర్తి చిన్నయ్య అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను సామాజిక పింఛనుదారుడు కావడంతో గ్రామ వలంటీర్ కొప్పర్తి సూర్యకుమారి సొంత ఖర్చులతో ఒమ్మంగి నుంచి కాకినాడ 50 కిలో మీటర్ల మేర ఆర్టీసీ బస్‌లో ప్రయాణించి చిన్నయ్యకు పింఛను సొమ్ము అందజేసింది. వలంటీర్ సూర్యకుమారి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

జగ్గంపేట: మండలంలో మల్లిసాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. మల్లిసాలలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో నక్కరాజు చంద్రబాబు, పాలిపిరెడ్డి గంగాధరరావు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.31 వేల విలువైన 150 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా వారికి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

127 మద్యం సీసాల స్వాధీనం

ప్రత్తిపాడు: గాంధీ జయంతి సందర్భంగా తనిఖీలు నిర్వహిస్తున్న ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బందికి సోమవారం బెల్ట్ షాపుల్లో విక్రయానికి సిద్ధం చేసిన మద్యం సీసాలు పట్టుబడ్డాయి. స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ముద్దా నూకరాజును అదుపులోకి తీసుకుని అతని నుంచి 102 మద్యం సీసాలను, 18 బీరు సీసాలు వెరసి 120 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడిలో ఏడు మద్యం సీసాలతో బొంద సత్తిబాబును అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ సీసాలన్నీ డ్యూటీ పెయిడ్ మద్యంగా ఉన్నాయన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై బి. శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


20 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలకు చెందిన 1999–2002 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తరువాత తుని మండల శివారు వన్ హోటల్ సమీపంలోని తోటలో కుటుంబ సమేతంగా కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఇకపై ఏటా కలుసుకోవాలని, కళాశాలకు సైతం తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు హరివర్మ, గోవిందు, కరీమ్, బంగారు బాస్, రేణుక, ఉమా, సునీత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: ఆడపిల్లలు చదువులో రాణించాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆకాంక్షించారు. స్థానిక సాయి బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చదువుకునే ముందు లక్ష్యం నిర్దేశించుకోవాలన్నారు. మహిళల కోసం ఏలేశ్వరంలో ప్రత్యేకంగా మహిళా కళాశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్‌లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, ప్రిన్సిపాల్ సుంకర హైమావతి, కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సుంకర రాంబాబు అధ్యాపకులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి

ఏలేశ్వరం: మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సామంతుల వారి వీధిలో లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సౌమ్యుడిగా, నిజాయితీకి మారుపేరుగా జీవించిన లాల్‌బహదూర్ శాస్త్రిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, సిరిపరపు రాజేష్ పాల్గొన్నారు.

గొంది భూముల పరిశీలన

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానానికి శంఖవరం మండలం గొంది గ్రామంలో గల 33 ఎకరాల భూమిని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్, అటవీశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ భూమిలో గతంలో వివిధ రకాల వృక్షాలు ఉండేవి. కొండ భూమి కావడంతో ఏ పంట సాగుచేయడానికి అవకాశం ఉండేది కాదు. ఈ భూమిలో చెట్లు, వాటి మోడులు కూడా కొట్టుకుపోయేందుకు ఓపెన్ టెండర్ కం వేలం ద్వారా ఖరారు చేశారు. అనంతరం ఈ భూమిని చదును చేయించారు. ప్రస్తుతం భూమి ఖాళీ గా ఉండడంతో ఇందులో ఏ మొక్కలు నాటాలనే దానిపై సోమవారం అటవీశాఖ అధికారులతో కలిసి దేవస్థానం చైర్మన్, ఈఓలు పరిశీలించారు.

స్ఫూర్తిప్రదాత గాంధీజీ


ఏలేశ్వరంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్


తునిలో గాంధీజీ విగ్రహానికి నాయకుల నివాళి


తుని మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


కోటనందూరులో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు


గండేపల్లిలో మహాత్ముని చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ఎంపీపీ దొరబాబు


జగ్గంపేటలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఒమ్మి రఘురాం తదితరులు


కిర్లంపూడిలో మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


ఒమ్మంగిలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


తొండంగిలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు

- వాడవాడలా గాంధీజీ జయంతి వేడుకలు
- జాతిపితకు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఏలేశ్వరం: జాతిపిత గాంధీజీ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలు సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని బాపూజీ విగ్రహాలకు స్థానిక నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరం వాగువారివీధిలోని గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గాంధీజీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, వాగు బలరామ్ పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీపీ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక షిర్డీ నగర్ గాంధీనగర్‌లో గాంధీజీ విగ్రహానికి ఆర్య వైశ్య సంఘం, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు గొల్లపల్లి త్రిమూర్తులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, గూడవల్లి అర్జునరావు, కోరాడ అప్పలస్వామి పాల్గొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తుని: దేశ స్వాతంత్ర్యం కోసం జాతిపిత మహాత్మా గాంధీ చేసిన సేవలు అజరామమని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం, గాంధీ సత్రంలో సోమవారం గాంధీజీ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత గాంధీజీ విగ్రహాలకు చైర్‌పర్సన్ సుధారాణి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ సత్రంలో మహిళలకు వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, ప్రభుత్వ బాలికల కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, జెడ్ఆర్‌యూసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

ప్రత్తిపాడు రూరల్: మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నెరవేరిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో సోమవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మగాంధీ చేసిన శాంతియుత పోరాటాన్ని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, పెనగంటి రాజేష్, శరకణం సంతోష్, సంఘన వెంకటేశ్వరరావు, బిళ్లకుర్తి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో గాంధీజీ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ బండారు రాజా ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసంత్ కుమార్, పంచాయితీ కార్యదర్శి గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జగ్గంపేట: స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహాలకు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త కొత్త భైరవ కృష్ణ, బొండా వీరసత్య, మానేపల్లి బంగార్రాజు, కంచర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గొల్లవిల్లి రామకృష్ణ, ఎంపీడీఓ వి.రామన్, ఈఓపీఆర్డీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, జెడ్పీ హైస్కూల్లో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. అల్లిపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, జగన్నాథపురంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శంఖవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీడీఓ జి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఈగల అప్పారావు, బుర్ర లచ్చ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. తేటగుంట సచివాలయంలో ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంగల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, పార్టీ నాయకులు పోతల రమణ, కుసనం దొరబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక గాంధీ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఇందన ఏసుబాబు, ఏడిద రెడ్డినాయుడు, గుడాల వెంకటరత్నం, గొంప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లయన్స్ కల్యాణ మండపం ప్రాంగణంలో మొక్కలు నాటారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగుహూరి మధుబాబు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా గాంధీ జయంతి

గోకవరం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని గాంధీజీ విగ్రహాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు నివాళులర్పించారు. గోకవరం గాంధీపార్కులోని గాంధీజీ విగ్రహానికి పార్టీలకు అతీతంగా నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మహాత్ముని ఆశయ సాధనకు కృషి చేయాలి

తొండంగి: జాతి పిత మహాత్మా గాంధీజీ ఆశయసాధనకు యువత కృషిచేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీడీఓ పసపులేటి సతీష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు దడాల విజయ్‌కుమార్, ఎంపీటీసీలు శివకోటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.